

అనంతపురానికి తరలించిన బ్యాలెట్ బాక్సులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలైన బ్యాలెట్ బాక్సులను పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో అనంతపురానికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి వీటిని తరలించారు. పట్టభద్రుల పోలింగ్ బాక్సులు జిల్లా నలుమూలల నుంచి 54, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన 32 బాక్సులను భద్రంగా తరలించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల నుంచి సోమవారం అర్ధరాత్రికి పుట్టపర్తి లోని చిన్న పల్లి జెడ్‌పి పాఠశాలలోని స్ట్రాంగ్ రూముకు ఎన్నికల అధికారులు తరలించారు. జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, ఎస్‌పి రాహుల్ దేవ్ సింగ్ ఆ బాక్సులను పరిశీలించిన తర్వాత అనంతపురంలోని జె ఎన్ టి యు కళాశాలకు పోలీసు బందోబస్తుతో తరలించారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కౌంటింగ్ సిబ్బంది. ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సుదీర్ఘ ప్రక్రియ

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
కౌంటింగ్ సిబ్బందికి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచన

ప్రజాశక్తి-అనంతపురం

దశల వారీగా సుదీర్ఘంగా సాగే ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జేఎన్టీయూలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్ లు పాల్గొన్నారు. ఉమ్మడి కడప, అనంతపురము, కర్నూల్ జిల్లాల నుంచి కౌంటింగ్‌లో పాలుపంచుకోనున్న సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లను గుర్తించడం, ప్రాధాన్యతా ఓట్లను అభ్యర్థులకు బదిలీ చేయడం, అంతిమంగా విజేతను ప్రకటించడం వంటి అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల పాటూ జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిబ్బంది మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. సిబ్బందికి అనుకూలంగా ఉండేందుకు రోజుకు మూడు షిఫ్టుల వారీగా కౌంటింగ్ నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు సైతం షిఫ్టుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కడప-కర్నూల్-అనంతపురము పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల కౌంటింగ్‌లో రిజర్వుడు సిబ్బందితో కలిపి దాదాపు 600 మంది పాల్గొననున్నారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరి జవాహర్‌లాల్ లు మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులను సమన్వయపరుచుకుంటూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీదేవి, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ వైపే అంచనాలు

తాయిలాలపైనే అధికారపార్టీ నమ్మకం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికల పోలింగు సోమవారం ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పుడు గెలుపెరిదై ఉంటుందన్నదే సర్వత్రా సాగుతున్న చర్చ. అత్యధికంగా పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థులుగా బరిలోకి దిగిన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకే ఎక్కువ విజయావకాశాలున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు సైతం ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారన్నది ఓటింగు జరిగిన తీరు స్పష్టం చేస్తోందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా పట్టభద్రులకు సంబంధించి ఓటింగు ఈ ఎన్నికల్లో కొంత బాగా జరిగిందనే చెప్పవచ్చు. ఎక్కువ పోలింగు జరిగిందంటే అది ప్రభుత్వ వ్యతిరేకతను స్పష్టం చేస్తుందని రాజకీయవర్గాలు భావిస్తుంటాయి. పట్టభద్రులకు సంబంధించి చూస్తే పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పరిధిలో 49 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి 330124 ఓట్లు ఉంటే 244307 ఓట్లు పోలయ్యాయి. 74 శాతం ఓటింగు జరిగింది. సాధారణంగా అయితే 60 శాతం లోపే జరిగేవి. ఈసారి మాత్రం 74 శాతం పోలింగు జరిగిందంటే అది ప్రభుత్వ వ్యతిరేకతకు సంకేతమని చెప్పవచ్చు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి వచ్చే సరికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. 28148 ఓట్లు ఉంటే 25884 ఓట్లు పోలయ్యాయి. 91.96 శాతం ఓటింగు జరిగింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పిడిఎఫ్ అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతోపాటు, ప్రజాసంఘాల మద్దతు బలంగా ఉంది. పెద్దఎత్తున ప్రచారాలు నిర్వహించడంతోపాటు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. దీంతో పిడిఎఫ్ అభ్యర్థులకు అన్ని వర్గాల నుంచి మద్దతు ముందు నుంచి లభిస్తూ వచ్చింది. ఇది పోలింగులోనూ స్పష్టంగా కనిపించదని విశ్లేషకులు సైతం చెబుతున్నారు. ఇక అధికారపార్టీ మద్దతుదారులు మాత్రం తమకు అనుకూలంగా జరిగిందని చెబుతుండటం గమనార్హం. ఏ ఇతర అభ్యర్థులు తమలాగా ఓటర్లకు తాయిలాలు ఇవ్వలేదని చెబుతున్నారు. తాయిలాలు చాలా వరకు పనిచేస్తాయన్న నమ్మకాన్ని పెట్టుకున్నారు. అయితే ఎవరికి అనుకూలంగా ఓటర్లు తీర్పు ఇచ్చారన్నది ఈనెల 16వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపుతో తేలనుంది. ఇప్పటికే ఓటరు తీర్పు ఇచ్చియున్నారు. ఇచ్చిన తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉన్నాయి. పోలింగు ముగిసిన నేపథ్యంలో బాలెట్ బాక్సులు మంగళవారం నాడు జిల్లాలోని జెఎన్‌టియు కళాశాలకు చేరాయి. ఓట్ల లెక్కింపు ఇక్కడే జరగనున్నందున, ఆరు జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు అనంతపురంకు తీసుకొచ్చారు. ఈ బాక్సులను స్ట్రాంగు రూముల్లో భద్రపరిచారు. అదే విధంగా మంగళవారం ఉదయం రిటర్నింగు అధికారి అయిన జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి మైక్రో అబ్జర్వర్ల ద్వారా ఓటింగుకు సంబంధించిన స్క్రూటినీ పూర్తి చేశారు. అనంతరం ఓట్ల లెక్కింపుపైనా లెక్కింపు సిబ్బందితోనూ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేపు జరిగే ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈ ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.





పెద్దవడుగూరులో సోమవారం ఓటువేసేందుకు బారులు తీరిన ఓటర్లు . ఇన్‌సెట్‌లో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు



అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న డిఇఒ సాయిరాం

పాఠశాలలో లోపాలను సరిదిద్దుకోవాలి

లేదంటే చర్యలు
డీఈవో సాయిరాం

ప్రజాశక్తి- అనంతపురం సిటీ

పాఠశాలలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం హెచ్చరించారు. మంగళవారం అనంతపురం నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదిల్లోకి వెళ్లి విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. బైజూస్ ట్యాబులను వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌ఎం చాంబర్‌కి వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్స్‌ని పరిశీలించారు. ఏ సబ్జెక్టుకు ఎంతమంది టీచర్లు ఉన్నారు..అకడమిక్ క్యాలెండర్ ఉందా లేదా అని హెచ్‌ఎంని అడిగి తెలుసుకున్నారు. చాలామంది విద్యార్థులు కొన్ని రోజులుగా పాఠశాలకు రాకపోవడం, తరగతి గదులు అధ్వానంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారా? లేదా?, మధ్యాహ్నం భోజనం అందరూ తింటున్నారా లేదా అని ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం మెనూని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి అయిందా? లేదా? అని హెచ్‌ఎం, టీచర్లతో మాట్లాడారు. టీచర్ల డైరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. డైరీలు అప్‌డేట్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నోటు బుక్ లను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కరెక్షన్ చేయడం లేదని గుర్తించారు. గత రెండు వారాలకు సంబంధించిన విద్యార్థుల అటెండెన్స్ రిపోర్టు ఇవ్వాలని హెచ్‌ఎంని ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడమే కాకుండా నైట్ విజన్ కూడా నిర్వహించాలని ఆదేశించారు. నైట్ విజన్ అదనపు పని అనుకోకూడదని అన్నారు. పది ఫలితాల పెంపు కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ట్యాబులు వినియోగిస్తున్నారో లేదో రోజూ పర్యవేక్షించాలన్నారు. ట్యాబులు కచ్చితంగా వినియోగిస్తామని 8వ తరగతి విద్యార్థులతో ప్రతిజ్ఞ కూడా చేయించాలన్నారు. పాఠశాలలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి సెక్రెటరీ లోకేశ్వర్ రెడ్డి, ఏపీవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఆయన పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ అధికారుల తరఫున అల్బెండజోల్ మాత్రలను బడి పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలందరికీ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. పిల్లలు మిస్ అయితే వారికి మళ్లీ ఈనెల 18వ తేదీన అల్బెండజోల్ మాత్రలను వేస్తామని చెప్పారు. కడుపులో నులి పురుగులు ఉండడం వల్ల చదువుపై శ్రద్ధ తక్కువగా ఉంటుందన్నారు. అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. నులిపురుగుల వల్లనే ఇలాంటి లక్షణాలు వస్తాయనేది తెలియదన్నారు. అనంతరం కలెక్టర్ పుట్టపర్తిలోని సాయి సనాతన మాంటిస్సోరి స్కూల్లో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కలెక్టర్ ముందుగా తన మనవడు కిరీటి విరాజ్‌కి మాత్రలు వేసి, తదనంతరం చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి అనిత, డిఎంహెచ్ఒ ఎస్వి.కృష్ణారెడ్డి, డాక్టర్లు నివేదిత, ఫణీంద్ర, జోత్స్న సిడిపిఒ గాయత్రి, సూపర్‌వైజర్ లక్ష్మన్న, మునిసిపల్ కౌన్సిలర్లు నాగమణి, సరస్వతి, ఎంఇఒ వెంకటరమణ నాయక్, హెల్త్ సెక్రెటరీ పరిమళ, హెల్త్ అసిస్టెంట్లు అజీజ్ ఖాన్, సూరశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిత్యం రద్దీగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

సర్వర్ షట్ డౌన్..

నిలిచిన ప్రభుత్వ సేవలు
ఇబ్బంది పడ్డ ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ సర్వర్ మంగళవారం ఒక్కసారిగా షట్ డౌన్ అయింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు సైతం ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి రోజూ ఉదయం విధులకు హాజరైన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. అయితే ఉదయం నుంచి సర్వర్ పని చేయకపోవడంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు సైతం వేయలేకపోయారు. దీంతో పాటు నిత్యం కళకళలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఒక్కసారిగా బోసిపోయింది. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, నీటి పన్నులతో పాటు ఇతర పన్నులు చెల్లించడానికి మంగళవారం పురపాలక సంఘం కార్యాలయానికి వచ్చారు. సర్వర్ పని చేయకపోవడంతో వెనుతిరిగారు. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, మండల తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయం ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో ప్రభుత్వ సేవలన్నీ ఒక్కసారిగా నిలిచిపోయాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది రిజిస్టర్, ఇసితో పాటు వివిధ సేవల కోసం వచ్చి వెనుదిరిగారు. సర్వర్ పనిచేయక పోవడంతో పనులు లేక అధికారులు, సిబ్బంది కార్యాలయంలో ఖాళీగా ఉండిపోయారు. దీంతో ఒక్క సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం దాదాపు రూ.5 లక్షలకు పైగా నష్టం జరిగింది. దీంతో పాటు మున్సిపల్, వాణిజ్య పన్నుల శాఖ, రవాణ శాఖ తరపున అందే ఆదాయం అంతా నిలచిపోయింది.

రోజుకు 50 వరకు డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యేవి
సబ్ రిజిస్ట్రార్ శేఖర్‌రెడ్డి

హిందూపురం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో దాదాపు రోజుకు 50 వరకు వివిధ రకాల డాక్యుమెంట్లు రిజిస్టర్ జరిగేవి. ఉదయం నుంచి సర్వర్ పని చేయక పోవడంతో ఒక్కటి సైతం రిజిస్టర్ చేయలేదు. దీంతో మంగళవారం కార్యాలయానికి దాదాపు రూ.5 లక్షల వరకు ఆదాయం తగ్గింది.

సమసమాజ దార్శనికుడు కారల్ మార్క్స్

సిపిఎం ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ వర్ధంతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, శ్రామికులు వెట్టి చాకిరి, శ్రమ దోపిడి నుంచి విముక్తి పొందేలా సమ సమాజ స్థాపనకు కృషి చేసిన సమాజ దార్శనికుడు కారల్ మార్క్స్ అని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో మహా మేధావి, మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం నాయకులు మసూద్ అధ్యక్షన ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కారల్‌మార్క్స్ ప్రపంచంలో ఉన్న కార్మికులను, కర్షకులను పెట్టుబడిదారులు, భూస్వాములు ఏ విధంగా తమ శ్రమను దోచుకుంటున్నారో సమాజానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి కారల్‌మార్క్స్ అన్నారు. పీడితులకు ఒక దారి చూపిన మహోన్నత వ్యక్తి అన్నారు. ప్రపంచంలో కార్మికులను పెట్టుబడిదారులు ఏ విధంగా మోసం చేస్తున్నారో వారి శ్రమను ఏ విధంగా దోచుకుంటున్నారో, పెట్టుబడిదారుల సంపద ఏ విధంగా పోగుపడుతోందో క్యాపిటల్ బుక్‌లో వివరించారని తెలిపారు. 170 సంవత్సరాల కిందట రాసిన పుస్తకం ఇప్పటికీ అనేక మంది దానిని చదువుతూ ప్రపంచంలో జరుగుతున్న ఆర్థిక సంక్షోభాల నుంచి ఎలా బయటపడాలో పెట్టుబడిదారులు కూడా ఆ పుస్తకాన్ని అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. మానవ సంబంధాలు అన్నీ ఆర్థిక సంబంధాలే అని చెప్పిన మేధావి మార్క్స్ అని తెలిపారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న గొప్ప విప్లవవీరుడు మార్క్స్ అని కొనియాడారు. కమ్యూనిస్టులకు దిశా నిర్దేశం కోసం కమ్యూనిస్టు ప్రణాళికను మార్క్స్ ఏంజెల్స్ రచించిన పుస్తకమే ఇప్పటికీ కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలీ, బాబు, ఎన్టీఆర్ శీన, ప్రసాదు, లక్ష్మీనారాయణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకష్ణ, నూరుల్లా, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు శివ, నాగరాజు, గౌడ్, భవాని శీన, వన్నూరప్ప సాంబ, ఇస్మాయిల్, రవి తదితరులు పాల్గొన్నారు.



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఇచ్చిన హామీలు అమలుచేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -పెనుకొండ

పారిశుధ్య కార్మికుల ఉద్యోగాల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం తదితర సమస్యల పరిష్కారం కోసం మార్చి 17న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు. మంగళవారం పెనుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి పాల్గొని మాట్లాడారు. ఈనెల 17న సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులు మున్సిపల్ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేస్తున్నారన్నారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా పాలకవర్గాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే6 నెలల్లో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని జగన్మోహన్ రెడ్డి హామీల వర్షం కురిపించారన్నారు. గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మార్చి 14 నుండి 21 తేదీ వరకు జరుగుతున్న బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి కార్మికుల న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు రిక్షా నరసింహులు, చిన్న వెంకటేష్, తిప్పన్న, ఇ.వెంకటేష్, గజేంద్ర, ముత్యాలు, నరసింహులు, శాంతమ్మ, నాగమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

వినియోగదారులకు న్యాయం చేయడానికి ప్రత్యేక చట్టాలు

నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి - అనంతపురం

ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15న నిర్వహించుకుంటున్నాం. ప్రపంచంలో మొదట సారి 1962 మార్చి 15 వ తేదీన వినియోగ దారులకు హక్కులు గుర్తించి ప్రకటించారు అప్పటి అమెరికా అధ్యక్షులు జాన్ ఎఫ్ కెన్నెడీ. మన భారతదేశంలో 1986 డిసెంబర్ 24 వినియోగదారుల చట్టం అమలు చేసారు. దీనిని జాతీయ వినియోగదారుల దినోత్సవంగా పరిగణిస్తారు.

వినియోగ దారుడు అంటే ఎవరు : ఎవరైతే డబ్బు పెట్టి వస్తువులను కొని వినియోగించుకొంటారో వారందరు వినియోగ దారులే. అలాగే డబ్బుపెట్టి సేవలను సర్వీసులను వినియోగించుకొనే వారందరు కూడా వినియోగదారులే.

వినియోగ దారులకు ఉన్న హక్కులు ఆరు. అవి..

1.కొనుగోలు చేయు వస్తువులు ద్వారా తనకు గానీ తన ఆస్తికి గానీ ప్రమాదముకుండా రక్షణ పొందే హక్కు

2.వస్తువులు సేవలు నాణ్యత, పరిపూర్ణత స్వచ్ఛత, ధర తెలుసుకునే హక్కు.

3.మనకిష్టమైన వస్తువులు సేవలు ఎంపిక చేసుకునే హక్కు

4.విన్నవించుకొనుహక్కు, మనవి చేసుకొను హక్కు

5.దోపిడికి పాల్పడే వాణిజ్య పెద్దలకు వ్యతిరేకంగా పరిష్కారం పొందేహక్కు.

6.వినియోగ దారులుగా అవగాహన కలిగి ఉండే హక్కు.

వినియోగ దారుల గొప్పతనమేమి? ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువు వినియోగదారుడు ఎలా? వినియోగ దారులు వివిధ రకాల వస్తువులను కొనడం, సేవలను వినియోగించుకుని కొంతలో డబ్బులు చెల్లిస్తారు. కొనడం, వినియోగించుకోవడం కోసం చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వాలకు వచ్చే ఆదాయమే ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధుల జీతభత్యాలు,అభివృద్ధి కార్యాలు జరుగుతాయి.



వినియోగదారులు ఎలాగా నష్టపోతున్నారు... నేటి ఆధునిక ప్రపంచంలో ఎక్కడ చూసినా కల్తీలు, నకిలీలు, అనుకరణలు. ఒకటికొంటే ఒక్కటి ఉచితమని, ప్రత్యేక తగ్గింపు అని చాలా ఘోరంగా మోసపోతున్నారు. అందుకు కారణం చాలామంది ప్రజలకు సరైన అవగాహన లేకపోవటమే. ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ప్రపంచ వినియోగ దారుల దినోత్సవం అని, జాతీయ వినియోగదార్ల దినోత్సవం అని దాదాపు ఆరవై సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. అయితే ప్రయోజనం మాత్రం శూన్యం. అందుకు కారణం సరైన నిబద్ధత లేకపోవడం. ఇతర వినియోగదార్ల సంస్థలను ప్రోత్సహించక పోవడం.

వినియోగ దారులు నష్టపోతే ఎలాగా న్యాయం పొందాలి ...

ప్రతి జిల్లాలోను వినియోగదారుల న్యాయస్థానం ఉంటుంది. దీనిని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అంటారు. యాభై లక్షల రూపాయల వరకు జిల్లా కమిషన్ లోను, రెండుకోట్ల రూపాయల వరకు రాష్ట్ర కమిషన్ లోను, రెండు కోట్ల రూపాయలు, అంతకు పైన అయితే జాతీయ న్యాయస్థానంలోను వివాదాలను పరిష్కరించుకోవచ్చు.

వై.మోహన్
అధ్యక్షులు వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ



రికార్డులు తనిఖీ చేస్తున్న రమ

గ్రంథాలయం తనిఖీ

ధర్మవరం టౌన్ : ధర్మవరం శాఖ గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సభ్యత్వంతోపాటు ప్రతి రోజు గ్రంథాలయానికి ఎంతమంది పాఠకులు వస్తున్నారు తదితర విషయాలను గ్రంథాలయ శాఖ అధికారిణి అంజలి, సౌభాగ్యవతిని అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణానాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రవాణా ఉద్యోగులకు అభినందనలు

కదిరి టౌన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి వచ్చిన ప్రజలకు మంచి రవాణా సేవలందించిన కదిరి ఆర్టీసీ డిపో ఉద్యోగులను, సూపర్వైజర్లను, వాలంటీర్లనుకదిరి డిపో మేనేజరు మైనోద్దీన్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారంకదిరి డిపోకు రూ.26.73 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఇపికె 43.01, ఆక్యుపెన్సీ రేషియో: 77 గా నమోదు అయిందన్నారు. ఒక్కొక్క బస్సుకు సరాసరి రూ.26,732లు ఆదాయం సమకూరిందన్నారు. కదిరి నుండి హిందూపురం రూట్లో డ్యూటీ చేసిన కండక్టర్ జి.సంజీవరెడ్డి అత్యధిక కలెక్షన్ రూ.28,000 తెచ్చి అత్యధిక ఇపికె రూ.74.58 గా నమోదు చేశాడన్నారు.

ఆర్థిక సాయం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం బాలప్పగరి పల్లి అంజి కుటుంబీకులకు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ 10వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. వడ్డే అంజి సమారాధన కార్యక్రమానికి కుటుంబీకులు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ని ఫోన్ ద్వారా సాయం కోరగా వెంటనే స్పందించి మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ ద్వారా సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, సరినేని కిరణ్, ముబారక్, నాగేష్, కిరణ్, కార్తిక్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

చిలమత్తూరు : మండలకేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణ,అగ్గిశీనివాసులు,మండల అధ్యక్షుడు చిన్నా ప్రవీణ్ తదితరులు కేక్ కట్ చేశారు.

నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

ధర్మవరం టౌన్ : తెలుగుదేశం పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హాజరుకానున్నారన్నారు. ఈ సమావేశంలో నారాలోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంచేయడానికి టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుంటారన్నారు. పాదయాత్ర విజయవంతం కోసం నియోజకవర్గం వ్యాప్తంగా యువకులు వెయ్యిమందితో యువగళ దళం పేరుతో ఒక బృందానిన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియోజవర్గంలో పాదయాత్ర ప్రారంభం నుంచి ముగిసేవరకు టీఎం సభ్యులు పాదయాత్ర వెన్నంటే ఉంటారన్నారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అనుబంధసంఘాలు హాజరుకావాలని కోరారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆమడగూరు : స్థానిక ఐకెపి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి షేక్ నసీమా, ఎపిఎం గోపాల్ మాట్లాడుతూ పిల్లలకు సంస్కరణలతో కూడిన విద్యను అందించాలన్నారు. అందులో తొలి ప్రయత్నం తల్లిదే ఉండాలన్నారు. గురువు చెప్పింది వింటే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమత మండల సమైక్య అధ్యక్షురాలు అనూష, కార్యదర్శి అనిత, కోశాధికారి సుజాత, అకౌంటెంట్ లక్ష్మీకాంతమ్మ, సీసీలు శంకర్ నాయక్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

బత్తలపల్లి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని దంపెట్ల గ్రామ సచివాలయంలో రామాంజులపల్లి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన 14 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు ఆర్డీటీ ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రావడంతో వారికి ఇంటి పట్టాలను తహశీల్దార్ యుగేశ్వరిదేవి మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భారతి. సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

రొద్దం : మహిళా చట్టాలపై అవగాహన సదస్సును టింబక్టివ్ కలెక్టివ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నారనాగి పల్లి గ్రామంలో అనంతశక్తి సిఇఒ లావణ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాశక్తి నుంచి రమేజా,ప్రతిభ సొసైటీ నుంచి నరసింహ, వరలక్ష్మి, జయశ్రీ పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలు, గృహహింసపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ఓబుల దేవర చెరువు : చిన్నారులు ఆరోగ్యసూత్రాలు పాటించేలా చూడాలని వైద్యులు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అల్లా పల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, రైన్‌బో ప్రైవేటు పాఠశాల, గౌనిపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని డిపిఎంఒ చిన్నకుళ్లాయప్ప నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో చేపటిట్న జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్త హీనతను అధిగమించినప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సుభాషిని, ల్యాబ్ టెక్నీషియన్ నరేంద్ర, అశ్విని, అంగన్వాడీ కారయకరతల షమీం తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్వాడీ, ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు ఆల్‌బెండాజోల్ మాత్రలను వేశారు. మండల వ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల లోపు 5962 మంది పిల్లలు ఉండగా, అందులో మంగళవారం 5310 మంది పిల్లలకు మాత్రలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

సోమందేపల్లి : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నరేష్ కుమార్, హరీష్ కుమార్, మండల విద్యాధికారి ఆంజనేయ నాయక్, ఇఒఆరడి నాగరాజు రావ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాదరవలి ఆధ్వర్యంలో పిల్లలకు మాత్రలు వేయించారు. తల్లిదండ్రులు పిల్లల ఆహార అలవాట్లపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ మనోహర్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర, నారాయణమ్మ, ఎఎన్ఎంలు లక్ష్మీదేవి, శారద ,తదితర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి సెంటర్లలో వైద్య సిబ్బంది జాతీయ నులి పురుగుల నిర్మూల దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెనుగొండ డివిజన్ డిప్యూటీ డిఎం హెచ్ఒ మంజువాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు చిన్నారులకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సౌందర్య, ఎంపిహెచ్‌ఎస్ వెంకట్ నారాయణ, ఎఎన్ఎంలు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : మండల ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ జగదీష్ బాబు ఆధ్వర్యంలో పెద్దమంతుర్ హైస్కూల్‌లో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆల్‌బెండాల్‌జోల్ మాత్రలు మింగడం వల్ల ఒకటి నుంచి 19 సంవత్సరముల బాల, బాలికలకు రక్తహీనత నివారించబడుతుందనానరు. అనంతరం హైస్కూల్‌లోనిగల మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ మహాలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధాయయులు, ఎంపిహెచ్ఒ బి. శ్రీనివాసులు, ఇఒఆర్‌డి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుడిబండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఒ

బత్తలపల్లి : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ విద్యాసంస్థలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సత్యసాయి జిల్లా ఎన్డీడీ కార్యక్రమ నోడల్ అధికారి(సిరికల్చర్ జేడీ) పద్మమ్మ మండలంలోని సంజీవపురం వద్దనున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గంగిరెడ్డి, ఎంఇఒ చాముండేశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : నులి పురుగుల నివారణతో చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి నాంది పలుకుదామని వైద్యాధికారి ఆనంద్‌బాబు పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్ బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంజుశ్రీ, సిఒలు వెంకటరమణ, శివన్న, సరస్వతి, ముస్తఫా, రమేష్, అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

అమడగూరు : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్, డిఒ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి మోడల్ స్కూల్, కస్తూరిబాయి కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం 110 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం 139 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. విద్యార్థులు 8:30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో వుంటుందని అన్నారు.

ధర్మవరం టౌన్ : బుధవారం నుంచి జరిగే ఇంటర్మీడియేట్ పరీక్షలకు విద్యార్థులకు సకాలంలో హాజరుకావాలని డివిఇఒ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలో ఐదు కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు పరీక్షలు ఉంటాయని, ఉదయం 8-30 గంటలకే విద్యార్థుళు కేంద్రాల వద్దకు చేరుకోవాలనానరు. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు చెందిన విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించామన్నారు.

హిందూపురం :
ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63,090 విద్యార్థులకు 99 సెంటర్‌లను ఏర్పాటు చేశారు.ఉదయం 9 గంటలు దాటి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షలకు అనుమతించరు. ఇంటర్ పరీక్షలు ఈనెల 15న ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 9307, రెండో సంవత్సరం 12597 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరి కోసం దాదాపు 1500 మంది సిబ్బందిని నియమించారు. దీంతో పాటు పరీక్షల పర్యేక్షణ కోసం 10 సిట్టింగ్ స్క్వాడ్, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సారి జరిగే పరీక్షలు చాల పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

ముంపు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి బుక్కపట్నం

చెరువు కింద చెరువు నీటితో ముంపునకు గురై పంటలు పండించుకోలేక నష్ట పోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని సత్య సాయి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం చెరువు కింద ముంపునకు గురై నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానకంపల్లి, బుక్కపట్నం, పెద్ద కమ్మవారి పల్లి గ్రామాలకు చెందిన రైతుల భూముల్లోకి చెరువు నీరు చేరి తీవ్రంగా నష్టపోయారన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి సంవత్సరం చెరువు నింపుతుండడంతో రైతులు రెండు మూడు సంవత్సరాలుగా పంటలు పండించుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు తమ భూములు చెరువు నీటితో మునిగిపోవడంతో పంటలు పండించుకోవాలని స్థితిలో ఉన్నారని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రైతులను ఆదుకొని నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్‌బాషా, తెలుగు యువత నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బొల్లె సుధీర్, సాయి ప్రసాద్, రమేష్, రమణ విజయ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేద్దాం

కదిరి టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం చేద్దామని టిడిపి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ టిడిపి నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కదిరి రూరల్ మండలం కుమ్మర వాండ్లపల్లి లక్కీ ఫంక్షన్ హాల్ లో పాదయాత్రపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ఈనెల 17 న కదిరి నియోజకవర్గానికి వస్తున్నందున మూడు రోజులపాటు సాగే పాదయాత్రకు సంబంధించి నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు

హిందూపురం : జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ సుమో సీనా, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, లింగప్ప, బాబా, జాహిద్, షౌకత్ ఖాన్, దాదు ఖాన్, రామకృష్ణ, అఖిబ్, లోకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ బహిష్కరణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని కోడూరు,శెట్టిపల్లి రెవెన్యూ పొలాలలో గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రైతుల నుండి సేకరిస్తున్న భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని సర్పంచి ఈడిగ మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోడూరు సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో భూములు కోల్పోయిన రైతులు రైతు సంఘం నాయకులు అధికారుల తీరును తప్పు పట్టారు. పాత గెజిట్ ప్రకారం భూములు కేటాయించకుండా బయోటెక్ పరిశ్రమకు మేలు చేసేలా వ్యవహరిస్తూ సామన్య రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు ఉంటేనే సామాన్య రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఈ గ్రామ సభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అయితే తహశీల్దార్ సర్ది చెప్పే ప్రయత్నం చేసినా రైతులు వినలేదు. రైతుల ఆందోళనకు వైసిపి సర్పంచి మురళి కూడా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, వీఆర్వో రాజేష్, కార్యదర్శి నాగరాజు, వైస్ ఎంపిపి అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు

నేరాలు ఘోరాలు

పట్టణంలో దొంగలు హల్‌చల్

సోమవారం రాత్రి ఐదు ఇళ్లలో చోరీ

మడకశిర : మడకశిర పట్టణంలో సోమవారం రాత్రి మారుతి నగర్‌లో16 ,17వ వార్డులలో దొంగలు హల్‌చల్ చేశారు. ఏకకాలంలో ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు .దాదాపు ఆరు లక్షల రూపాయలు విలువ చేసే బంగారు నగల తో పాటు 60 వేల రూపాయలు నగదును దోచుకెళ్లినట్టు బాధితులు వాపోయారు. రాత్రుల్లో పోలీసుల గస్తీ నామ మాత్రంగా చేస్తుండటం వల్ల పట్టణంలో దొంగతనాలు ఎక్కువయ్యాయన్న ఆరోపణలు బలంగా విన వస్తున్నాయి. మారుతి నగర్ లో నలుగురు వ్యక్తులు షార్ట్స్ , వేసుకుని మాస్కులు ధరించి అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఐదు ఇళ్లలో తాళాలు పగల గొట్టి గుల్ల చేసి వెళ్లి పోయారు.




సిసి పుటేజీలో కనిపిస్తున్న దొంగలు

ఈవ్‌టీజర్ అరెస్ట్

బుక్కపట్నం : ప్రేమ పేరుతో అమ్మాయి పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ ఫోటోలు వీడియోలు మార్ఫింగ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్న విశాఖపట్నం ప్రాంతానికి చెందిన చంద్రమౌళి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ వసంతకుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఒక యువతి వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామన్నారు. నిందితుడు చంద్రమౌళి వివాహం చేసుకొని కూడా చదువుకున్న అమ్మాయిలని లక్ష్యంగా పెట్టుకొని ప్రేమ పేరుతో నటిస్తూ వారికి తెలియకుండా వారికి ఫోటోలతో మార్ఫింగ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేసేవాడన్నారు. ఇదే అలవాటుగా చేసుకొని కొన్ని సంవత్సరాలుగా నిందితుడు వైజాగ్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటూ ప్రేమ పేరుతో మోసాలకు పాల్పడుతూ అమ్మాయిలను బెదిరిస్తూ, అమ్మాయిల కుటుంబ సభ్యులకు ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ బెదిరించేవాడని తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు టీములుగా ఏర్పడి మామిళ్లకుంట క్రాస్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యంలో అమ్మాయిలు జాగ్రత్తగా ఉంటూ ఇటువంటి మోసాలకు మోసపోకూడదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్ ఎక్సైజ్ కార్యాలయం వెనుక గల సమర్థనం ట్రస్ట్ కి సంబంధించిన హాస్టల్ లో గోపాల్‌కృష్ణ(28) అనే వికలాంగ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్రూం లో ఉరి వేసుకొని మృతిచెందాడని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సమర్థనం ట్రస్ట్ అందించే కోర్స్ కోసం రొద్దం మండలం నారనాగేపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌కృష్ణ రెండు నెలల క్రితం చేర వారు నిర్వహించే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ మధ్యకాలం చూపు మందగించడంతో మనస్థాపానికి గురైన గోపాలకృష్ణ ఆ హాస్టల్ లోని బాత్రూంలో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి ఈడిగ నరసింహులు పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



మృతుడు గోపాలకృష్ణ

టిడిపి, వైసిపి వర్గీయుల పరస్పర దాడులు

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామంలో మంగళవారం జరిగిన వివాదంలో వైసిపి వర్గీయులపై టీడీపీ వర్గీయులు దాడి చేయడంతో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోట్లమర్రి గ్రామంలో హనుమంతరెడ్డి ఇంటి వద్ద నుంచి తారు రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు మంజూరైంది. రోడ్డు వేయడానికి సచివాలయ ఇంజనీర్ పైఅధికారుల ఆదేశాల మేరకు కొలతలు వేస్తుండగా రోడ్డు సమీపంలో ఉంటున్న ఈడిగ ఓబిలేసు తమ వర్గీయులతో అక్కడికి చేరుకుని అడుడకున్నాడు. ఇంతలో అక్కడికి వైసిపి వర్గీయులు రామ్మోహన్‌రెడ్డి, అతని భార్య నాగరత్నమ్మ చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారి తీసింది. ఈక్రమంలో ఓబిలేసు వర్గీయులు దంపతులపై దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు. విషయం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తచెరువు : కొత్త చెరువులోని బుక్కపట్నం రోడ్డులో నడిమిగుట్ట వద్ద బులోరా వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో బుక్కపట్నం మండలం చిలకల గడ్డపల్లి కి చెందిన సుదర్శన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన సుదర్శన రెడ్డి (36) కీయా పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధి నిర్వహణ నిమిత్తము తన స్వగ్రామము నుండి కీయా కంపెనీకి వెళుతుండగా బుక్కపట్నం చెరువు కట్టపై బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో సుదర్శనరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ లింగన్న తెలిపారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం

రీజినల్ మేనేజర్ సుమంత్ ఆథోని

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆర్టీసీని లాబాల బాటలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అనంతపురం రీజినల్ మేనేజర్ సుమంత్ ఆథోని కోరారు. ఈమేరకు స్థానిక ఆర్‌టిసి డిపోను రీజినల్ మేనేజర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డిపో మేనేజర్ బాలాజీ దయాల్‌తో కలిసి బస్సుస్టేషన్ పరిసరాలతో పాటు గ్యారేజ్‌లో ఉన్న అన్ని విభాగాల సెక్షన్లు, కార్గో పార్సిళ్లను తనిఖీ చేశారు. అనంతరం డిపో పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందితో డిపో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాభాల బాటలో పయనించాలంటే కాలానుగుణంగా తీసుకోవాల్సిన వార్పులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరు తమ పరిధిలో శక్తి వంచన లేకుండా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా సైక్లిస్ట్ గీతారావుకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

తల్లి పాల ప్రోత్సహం నినాదంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సుమారు 3700 కిలోమీటర్లు దూరం సైకిల్ యాత్రను గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన అల్ట్రా సైక్లిస్ట్ గీతా రావు మార్చి 1న చేపట్టింది. ఈ యాత్ర మంగళవారం కొడికొండ చెక్‌పోస్టు వద్దకు చేరింది. చిలమత్తూరు మండలం చెక్‌పోస్టులో బిపిఎన్ఐ సంస్థ జాతీయ కార్యవర్గ సభ్యులు, అఖిల భారత చిన్న పిల్లల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ కేశవులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి, సన్మానించారు. ఈ సందర్భంగా గీత రావు మాట్లాడుతు హైదరాబాదుకు చెందిన ధాత్రి సంస్థ సహకారంతో సైకిల్ యాత్ర చేపట్టమన్నారు. ముఖ్యంగా ఆధునిక యుగంలో పిల్లలకు తల్లులు పాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసం తల్లి పాలను ప్రోత్సహిసూత ఈయాత్రను చేపట్టమన్నారు. కన్యాకుమారిలో యాత్రను ముగిస్తామని చెప్పారు.



గీతారావును సన్మానిస్తున్న డాక్టర్ కేశవులు, తదితరులు